# బొమ్మ - బొరుసు

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి

—(౦)—

నిర్మల నవ్వింది.
ఆ నవ్వులో ఎంతో ఆకర్షణ ఉంది.
ఆ నవ్వులో ఏదో అంతరార్థం ఉంది.
"ఎందుకు నవ్వుతున్నావ్?"
ప్రకాశరావు ప్రశ్నించేడు.
నిర్మల సమాధానం యివ్వలేదు
మళ్ళీ నవ్వింది.
విరగబడి నవ్వింది.
"మతిగాని పోయిందా?"
"అది కాదండీ?"
"ఏది కాదు?"
"నేను చెప్పను"
"పోనీ మానెయ్యి"
నిర్మలముఖం చిన్నబోయింది.
ఉత్సాహం దిగజారిపోయింది.
"బిక్కముఖం వేశావేం?"
ఓదార్చబోతున్నాడు ప్రకాశరావు
"చెప్పొద్దన్నారుగా"
"పోనీ చెప్పుచూద్దాం"
చెవిలో ఏదో చెప్పింది నిర్మల
ఆయనకూ నవ్వాగలేదు
నిర్మలకూడా నవ్వింది.
"అదా సంగతి?"
"మరేమిటనుకున్నారు?"
"అబ్బాయా? అమ్మాయా?"
"ఏమో! నాకేం తెలుసు!"
"పోనీ నీకెవరు కావాలో చెప్పు"
"అమ్మాయి కావాలి.
మరి మీకో?"
"నాకు అబ్బాయి కావాలి"
"ఊహూ! అమ్మాయి"
"ఊహూ! అబ్బాయి"
"నాకు అమ్మాయే కావాలి"
"అమ్మాయి అయితే కట్నాలిచ్చుకోవాలి"
"వరకట్న నిషేధం వచ్చిందిగా"
"నాకు అబ్బాయే కావాలి"
"అబ్బాయి అయితే చదివించుకోవద్దూ!"
"అయినా పర్వాలేదు"
"నాకు వద్దు"
"పోనీ లాటరీ వేద్దాం"
"సరే"
"బొమ్మ అబ్బాయి
బొరుసు అమ్మాయి
నీకేం కావాలి?"
"బొరుసు"
"కాదు. బొమ్మే పడింది"
"అమ్మో! మోసం చేశారు"
"నేనా?"
"అవును. మీరే!"
"పోనీ మళ్ళీ వేద్దాం"
"సరే. ఈసారి జాగ్రత్తగా చూడాలి"
"బొమ్మా! బొరుసా!"
"బొరుసు"
"అబ్బో! బొరుసే పడింది"
"నేనే నెగ్గేను"
"మొదట నేనూ నెగ్గేను"
"అది లెఖ్ఖ కాదు"
"యిదీ లెఖ్ఖ కాదు."
"నే నొప్పుకోను"
"మరోసారి వేద్దాం"
"ఊహూ"
"ముత్యం మూడుసార్లు"
"సరే. మీ యిష్టం"
నిర్మలకు నీరసం వచ్చింది
యిహ మాట్లాడలేకపోయింది.

II

"భోజనం తయారయిందా?"
ప్రకాశరావు అడిగేడు.
"లేదండీ?"
"మరి ఆఫీసుకు వేళవుతోంది"
"చాలా నీరసంగా ఉందండీ?"
"పనిమనిషి ఏమైంది?"

"ఈరోజూ రాలేదు"
"వంటపనులు చెయ్యొద్దని చెప్పలేదూ!"
"మరి ఎట్లాగ"
"పోనీ నువ్వోపనిచెయ్యి"
"ఏమిటది?"
"పుట్టింటికివెళ్లు"
"మరి మీరో?"
"నన్నుకూడా నీతో రమ్మన్నావా?"
"అదికాదండీ? మీకు
భోజన సదుపాయం ఉండదేమోనని"
"హోటల్లో తింటాను"
"ఆరోగ్యం పాడవుతుంది"
"పర్వాలేదు"
"సరేకానీ"
"మరేమిటి?"
'రాత్రిళ్లు యిల్లు కదలకుండా!"
"మంచి అనుమానమే"
నిర్మల పుట్టింటికి వెళ్ళింది.
ప్రకాశరావుకి ఒంటరి జీవితం
హోటలులో భోజనం
గడవని రోజులు
గడ్డురోజులు
కాలచక్రం గిర్రున తిరిగింది.
నవమాసాలూ నిండేయి
నిర్మలకు కవల పిల్లలు.
ఒక అబ్బాయి - ఒక అమ్మాయి
యిద్దర్నీ ఎత్తుకుంది.
యింటికి చక్కా వచ్చింది.
ప్రకాశరావు నవ్వేడు
నిర్మలా నవ్వింది
ఆయన అబ్బాయిని ఎత్తుకున్నాడు
ఆవిడ అమ్మాయిని ఎత్తుకుంది.
"యింతకూ ఎవరిపంతం నెగ్గినట్టు!"
"నాపంతం నెగ్గింది"
ధైర్యంగాఅంది నిర్మల
"నాపంతమూ నెగ్గింది
నీకు ఆడపిల్ల కావాలిగా
నువ్వేపెంచి పెళ్లి చేసుకో.
నాకు అబ్బాయి కావాలి
నేనే కష్టపడి చదివించుకుంటాను"
"అయితే మీకూ మాకూ మాటల్లేవు"
"ఏం!"
"యికమీదట మీరూ, అబ్బాయీ వేరు
నేనూ అమ్మాయీ వేరు"
ప్రకాశరావు నోట్లో
పచ్చివెలక్కాయ పడినట్టయింది
నిర్మల నవ్వింది
ఆయనా నవ్వేడు.


మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.